# The Word of Truth

# సత్యవాక్కు

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

# రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల సువార్త ప్రసారములు

**తెలుగు — SATYA VANI**

ఆది, మంగళ, గురు, శుక్ర శనివారాల్లో మధ్యాహ్నం 2-30 గం॥లకు

**హిందీ — SATYA SUSAMACHAR**

మంగళవారము
గురువారము } 9.00 to 9-15 p. m.
శుక్రవారము

శనివారము — 1-45 to 2-00 p. m.

**ఇంగ్లీషు — The Voice of Truth**

ఆదివారము —9-30 to 9-45 p. m.
మంగళవారము — 9-30 to 9-45 p. m.

**తమిళం — SATYA VAZHI**

మంగళవారము — 5-30 to 5-45 p. m.
గురువారము — 6-45 to 7-00 p. m.
శుక్రవారము — 6-45 to 7-00 p. m.

**మలయాళం — The Voice of Truth**

మంగళవారము — 3-45 to 4-00 p. m.
శుక్రవారము — 3-45 to 4-00 p. m.

---

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికి వినిపించండి.
తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు
కరస్పాండెన్సు కోర్సు కొరకు ఈ దిగువ చిరునామాకు వ్రాయండి.

## SATYA VANI

P. O. Box 80, KAKINADA-533 001

---

Razan Press, Kakinada.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box. 80, KAKINADA-533 001.**

*Editor* J. C. CHOATE

*Managing Editor* JOSHUA GOOTAM

**Pleading for restoration of pure New Testament Christianity**

సంచిక **1** — జూన్ **1981** — సంపుటి **11**


## సంపాదకీయము

### దేవుని హెచ్చరికలు

### *( The Warnings of God )*

ఆధునిక కాలములో మానవుల ప్రాణములను వారి, ఆస్థిని రక్షించుటకొరకు, అగ్నిప్రమాదములను గూర్చి, తుఫానులను గూర్చి, వాతావరణ మార్పులను గూర్చి ముందుగనే తెలియజెప్పు హెచ్చరిక పద్ధతులను మానవుడు తయారుచేసుకొని యున్నాడు. రాబోవుచున్న తుఫానులను గూర్చి, వరదలను గూర్చి ముందుగానే హెచ్చరిక చేయబడినందున ఆయా ప్రదేశములలోనున్న స్థానిక ప్రజల ప్రాణములు రక్షింపబడిన సందర్భములు అనేకములున్నవి. మరికొన్ని సందర్భములలో ఈ హెచ్చరిక పద్ధతులు లేనందున, లేక ఆ స్థానిక ప్రజలు హెచ్చరికను మన్నన చేయనందున గొప్ప నష్టము, ప్రాణహాని కూడ జరిగినట్లు మన మెరుగుదుము.

అదేవిధముగా దేవునినుండి మానవునికి హెచ్చరికలనిచ్చే గ్రంథము బైబిలు. దేవుడు మానవుని, అతని అవసరములను ఎరుగును; అతనికేది క్షేమమో కూడ ఆయన ఎరుగును. అందువలన ఆయన అతని వైపు చూచి ఏమి చేయవచ్చునో, ఏమి చేయకూడదో అను విషయములను గూర్చి అతనికి సలహానిచ్చుచున్నాడు. అతడు విని దేవుని సలహాలను మన్నిక చేసినప్పుడు దాని లాభముల నతడు పొందగలడు. అయితే అతడు తన కండ్లను, చెవులను మూసికొని, ఇయ్యుచున్న హెచ్చరికలను లెక్క చేయని యెడల దాని పర్యవసానము నతడు అనుభవించును (రోమా 11:22).

ఏదేను వనములో ఆదాము హవ్వలు ఫలాని చెట్టుయొక్క పండ్లు తినరాదని దేవుడు వారిని హెచ్చరించెను. దానిని గూర్చిన రికార్డు ఏమి చెప్పుచున్నదో వినుము! "మరియు దేవుడైన యెహోవా, ఈ తోటలోనున్న ప్రతి వృక్షఫలములను నీవు నిరభ్యంతరముగా తినవచ్చును; అయితే మంచిచెడ్డల తెలివినిచ్చు వృక్షముల ఫలములను తినకూడదు; నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవని నరుని కాజ్ఞాపించెను" (ఆది 2:16; 3:2,3). అయితే హవ్వ సర్పమువలన శోధింపబడి ఆ పండును తిని, ఆదాముకు ఇయ్యగా అతడును దానిని తిని వారెట్లు మోసగింపబడిరో ఆ కథనమును మనమెరుగుదుము (ఆది 3 అధ్యా). దాని ఫలితమేమంటే మొదటి స్త్రీ పురుషులు దేవునికి వ్యతిరేకముగా పాపము చేసిరి. తద్వారా మరణము సంప్రాప్తమాయెను.

ఆదికాండము 6:5-8 లో మానవుని చెడుతనము నంతటిని దేవుడెట్లు చూచెనో మనము కనుగొనగలము. నిజానికి తాను భూమిమీద నరులను చేసినందుకు యెహోవా సంతాపమునొంది తన హృదయములో నొచ్చుకొనెను. ఆ సమస్యను పరిష్కరించుటకుగాను తాను భూమిమీద సృజించిన వాటినన్నిటిని నాశనము చేయుటకు ఆయన

నిశ్చయించు కొనెను. అయితే ఒక మినహాయింపు ఉన్నట్లు మనము చదువగలము: "నోవహు యెహోవా దృష్టియందు కృప పొందినవాడాయెను" (అది 6:8). తాను ఒక గొప్ప జలప్రళయమును రప్పించబోవుచున్నట్లును, దాని నుండి నోవహును తన కుటుంబమును మరి కొన్ని పశుపక్ష్యాదులును రక్షింప బడుటకునుగాను నోవహు ఒక ఓడను తయారుచేసికొన వలెననియు దేవు డతనిని ఎట్లు హెచ్చరించెనో కూడ మనము చదువగలము (హెబ్రీ 11:7; 1 పేతురు 3:10). అప్పుడు నోవహు తన కాలపు ప్రజలు అతని ఓడలో ప్రవేశించి రక్షించ బడవచ్చునని బోధించెను. కాని వారు దానిని లక్ష్యపెట్టనందున వారందరు జలప్రళయములో నాశన మొందిరి (2 పేతురు 2:5).

సొదొమ గొమొర్రాలను పట్టణముల యొక్క దుష్టత్వమును బట్టి యెహోవా వాటిని నాశనము చేతునని హెచ్చరిక చేసెను. లోతు, అతని కుటుంబము, బహుశ మరికొందరు నీతిమంతులు అక్కడ ఉన్నందున ఆపట్టణములను రక్షించవలసినదని అబ్రహాము దేవుని బతిమాలెను. ఆపట్టణములో పదిమంది నీతిమంతులున్న యెడల వారిని బట్టి దానిని నాశనము చేయక యుందునని ప్రభువు అబ్రహామునకు హామీ యిచ్చెను. అయితే ఆ పదిమంది కనబడకపోవుటచే సొదొమ పట్టణమును అగ్నితోను గంధకముతోను నాశనముచేయక ముందు లోతును, అతని కుటుంబమును హెచ్చరిక చేయుటకు ఇద్దరు దేవదూతలు వెళ్ళిరి (అది 19 అధ్యా).

క్రీస్తు యొక్క మరణ సమాధి పునరుత్థానముల అనంతరము, ఆయన పరమందున్న తన తండ్రియొద్దకు ఆరోహణుడు కాక మునుపు, సువార్త లోకమందంతటికి ప్రకటింపవలెనని ఆజ్ఞయిస్తూ "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడునని" చెప్పెను. "నమ్మనొల్లని వానికి శిక్ష విధింపబడునని" అంటూ హెచ్చరిక చేసెను (మార్కు

16:15, 16). హెబ్రీ 11:6; మత్తయి 10:32, 33; లూకా 13:3 చదువుము.

వేరొక సువార్తను ప్రకటించుచు వచ్చువారిపైకి దేవుని శాపము వచ్చునని పౌలు హెచ్చరిక చేసెను (గలతీ 1:6-9). మన మాయన వాక్యమునకు కలిపినా దాని నుండి తీసివేసినా మనకు శిక్ష విధింపబడునని క్రీస్తు చెప్పెను (ప్రకటన 22:18, 19).

క్రీస్తు తన సంఘము కట్టుదునని వాగ్దానము చేసెను (మత్తయి 16:18). అపొ. కా. 2 వ అధ్యాయము ప్రకారము ఆయన నిజముగా తన సంఘమును కట్టెను. అప్పటి నుండి అనేక విధములైన సంఘములు స్థాపించబడుచునే యున్నవి. కాని అట్టివారందరు "పరలోకమందలి నాతండ్రి నాటని ప్రతి మొక్కయు పెల్లగింపబడునని" యేసు చెప్పిన మాటలను జ్ఞాపకముంచుకొనవలెను (మత్తయి 15:13). దాని యొక్క అర్థమేమంటే మానవునితో ఆరంభమయిన అన్ని సంఘములు, ప్రతి సంఘము చివరకు నాశనము చేయబడును. బైబిలులో కనబడని సంఘ సభ్యునిగా నీవున్న యెడల అది నాశనము చేయబడక ముందే దాని నుండి బయట పడుట మంచిది.

యేసు ఈ లోకమందు జీవించి యుండగా మరల వత్తునని ఆయన వాగ్దానము చేసెను (యోహాను 14:3). క్రీస్తు వచ్చి దేవుని నెరుగని వారికిని, సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయునని పౌలు చెప్పెను (2 థెస్స 1:7-9). ఈ భూమ్యాకాశములు రవులుకొని నాశనము చేయబడునని పేతురు చెప్పెను. మరియు దుష్టులందరు అగ్నిగంధకములతో మండుచున్న గుండములో పడవేయబడుదురని క్రీస్తు చెప్పెను (2 పేతురు 3:7, 12; ప్రకటన 21:8).

గనుక నా మిత్రులారా మనకు ముందుగనే హెచ్చరిక చేయబడి యున్నది. మనము వివేకులమయితే మన ప్రభువు ప్రేమతో

యిచ్చిన సలహాలను పాటింతుము. ఆయన చెప్పిన ప్రకారము తప్పక చేయునని తెలియజెప్పు ఉదాహరణలు మనకు అనేకము లున్నవి. దేవుడు కోరినట్లుగా మనము చేసిన యెడల ఆయన మనలను దీవించును. అట్లుగాక వేరొక విధముగా చేయుటకు మనము నిశ్చయించుకొనిన యెడల "పాపమువలన వచ్చు జీతము మరణము" అని మనకు జ్ఞాపకము చేయబడుచున్నది (రోమా 6:23).

---

# క్రైస్తవ జీవితము
## ( The Christian Life )

"మొట్టమొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులనబడిరి" (అపో. కా. 11:26). "అందుకు అగ్రిప్ప - ఇంత సులభముగా నన్ను క్రైస్తవుని చేయజూచుచున్నావే అని పౌలుతో చెప్పెను." (అపో.కా. 26:28). "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక ఆ పేరును బట్టియే దేవుని మహిమ పరచవలెను" (I పేతురు 4:16).

**A.** క్రైస్తవుడై యుండుట అనగా యేమిటి?

1. క్రైస్తవుడై యుండుటనగా గత పాపముల క్షమాపణ నొందుట (అపో.కా. 2:38).
2. క్రీస్తు శరీరమయిన సంఘములో సభ్యత్వము కలిగియుండుట (అపో.కా. 2:47).
3. దేవుని తండ్రీ యని పిలువగలుగుట (రోమా 8:15).
4. దేవుని కంగీకార యుక్తముగా ఆరాధించి, ఆయనను సేవించగలుగుట (యోహాను 9:31).
5. క్రీస్తునందు నిత్యజీవ నిరీక్షణ కలిగియుండుట (ప్రకటన 2:10).

**B.** ఒకడు క్రైస్తవుడగుట యెట్లు?

1. నీతి కలుగునట్లు ఒకడు విశ్వసించవలెను (రోమా 10:10).
2. జీవము కలుగునట్లు మారుమనస్సు నొందవలెను (అపొ. కా. 11:18).
3. రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనవలెను (రోమా 10:10).
4. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందవలెను (గలతీ 3:27; రోమా 6:3). అతడు తిరిగి జన్మించినవాడు (యోహాను 3:5). I పేతురు 1:23 కూడ చూడుము.
5. క్రైస్తవుడు క్రీస్తువలె జీవించవలెను, ఆయనను వెంబడించవలెను.

**C.** క్రైస్తవుడను పేరు ఎందుకు ధరించవలెను?

1. మనకొరకై చనిపోయిన క్రీస్తును అది ఘనపరచును (హెబ్రీ 2:10).
2. మనము క్రీస్తు నామములోనికి బాప్తిస్మము పొందితిమి (అపొ.కా. 19:5).
3. మానవకల్పిత నామములను పౌలు ఖండించెను (I కొరింథీ 1:10).
4. మనము క్రీస్తుకు వివాహము చేయబడిన వారము (రోమా 7:4). గనుక మనమాయన నామమును ధరించవలెను.
5. మరి యే ఇతర నామమున రక్షణలేదు (అపొ.కా. 4:12).
6. మనమాయన బిడ్డలము (గలతీ 3:26). కనుక మనమాయన కుటుంబములో యున్నాము. అందువలన ఆయన నామమునే తప్ప వేరొక నామమును ధరించరాదు.

నీవు నిజక్రైస్తవునిగా యెల్లవేళలందు ఉండుము!

D. రక్షింపబడి యుండాలంటే ఒకడు ఏమిచేయవలెను ?

a) ఈ గొప్ప ప్రశ్నలో ఈ దిగువసంగతులు ఇమిడి యున్నవి:

1. మానవుడు ఒకప్పుడు పాపములో నశించుచుండెను.
2. అయితే అతడు రక్షింపబడెను.
3. అతడు పడిపోయే ప్రమాదమున్నది.
4. రక్షింపబడియుండుటకు చేయవలసినది కొంతయున్నది.

b) పడిపోయే ప్రమాదమున్నది:

1. "దేమా యిహలోకమును స్నేహించి నన్ను విడిచిపెట్టెను" (2 తిమోతి 4:10).
2. సీమోను మారుమనస్సు పొంది ప్రార్థించవలెనని ఆజ్ఞాపింపబడెను (అపో.కా. 8:20).
3. కడవరిస్థితి మొదటి స్థితికంటె మరి చెడ్డదగును (2 పేతురు 2:20).

c) నిలువబడియుండుటకు క్రైస్తవులకు శక్తి యున్నది:

1. శ్రద్ధ కలిగియుండి క్రైస్తవలక్షణముల నలవరచుకొనుము (2 పేతురు 1:5-10).
2. నీ పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు జాగ్రత్త పడుము (2 పేతురు 1:10).
3. అప్పుడు నీవు తొట్రిల్లవు (2 పేతురు 1:10).

d. అనుసరించుటకు క్షేమకరమై నాలుగు సూత్రములు:

1. ప్రతి దినము బైబిలు చదువుము:

బెరయలోని క్రైస్తవులు ప్రతిదినము లేఖనములు పరిశోధించుచు వచ్చిరి గనుక వారు థెస్సలోనీకయులో యున్నవారికంటె ఘనులు (అపో. కా. 17:11). రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము క్రొత్తగా జన్మించినవారు నిర్మలమైన వాక్యమను పాలను అపేక్షింతవలెను (1 పేతురు 2:3). లోపల నాటబడిన

వాక్యము ఆత్మలను రక్షించును (యాకోబు 1:21). వాక్యమునుబట్టి మనకు తీర్పు జరుగును (యోహాను 12:48).

2. ప్రతి దినము దేవుని ప్రార్థించుము :
యెల్లప్పుడు ప్రార్థించుము. ప్రార్థన కొరకు సమయమును కేటాయించు కొనుము (ఎఫెసీ 6:18). పరలోక ధననిధిని పొందు నిమిత్తము ప్రార్థన ఒక తాళపు చెవి వంటిది. దానిని వినియోగించుము.

3. సంఘారాధన లన్నిటికి హాజరుకమ్ము :
సమాజముగా కూడుట మానవద్దు (హెబ్రీ 10:25); శిష్యులు ప్రతి ఆదివారము కూడుకొను చుండిరి (అపొ. కా. 20:7). క్రైస్తవులకు ఈ ఆత్మీయాహార మవసరము.

4. నీసమయమును తలాంతులను ధనమును ధారాళముగా దేవుని కిమ్ము : 1 కొరింథీ 16:2; 2 కొరింథీ 9:7 లను చదువుము. నీధన మెక్కడ ఉండునో అక్కడే నీహృదయ ముండును.

E. మన పరస్పర బాధ్యతలు :

a) ఒకరి నొకరు ప్రేమింపవలెను.

1. "నేను మిమ్మును ప్రేమించిన ప్రకారము మీ రొకని నొకడు ప్రేమించవలె ననుటయే నా ఆజ్ఞ" (యోహాను 15:12).
2. "మీరు ఒకని యెడల ఒకడు ప్రేమగలవారైన యెడల దీనినిబట్టి మీరు నాశిష్యులని అందరు తెలిసికొందురు" (యోహాను 13 : 35).
3. తాను చూచిన తన సహోదరుని ద్వేషించువాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు (1 యోహాను 4:20).

b) ఒకరి భారములను ఒకరు భరించవలెను :

1. "ఒకని భారముల నొకడు భరించి యీలాగు క్రీస్తు నియమమును పూర్తిగా నెరవేర్చుడి" (గలతీ 6:2).

2. ఏలయనగా ప్రతివాడును తన బరువు తానే భరించుకొన వలెనుగదా ?" (గలతీ 6:5).

3. ప్రతివాడు దేవుని యెడల తన బాధ్యతను తానే వహించ వలెను. ఒకడు మరియొకని నిమిత్తము దేవునికి విధేయుడు కాజాలడు. అయితే ఒకని బలహీనతలో మరియొకడు సహాయ పడగలడు.

c) ఒకని నొకడు క్షమింపవలెను :

1. "మీరు మనుష్యుల అపరాధములను క్షమింపకపోయిన యెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు" (మత్తయి 6 : 15).

2. ఎన్నిసార్లు మనము క్షమింపవలెను ? "ఏడుమారులు మట్టుకే కాదు, డెబ్బది ఏళ్ళ మారుల మట్టుకని", యేసు పేతురుతో చెప్పెను (మత్తయి 18:22).

3. "ఒకడు ఒక దినమున ఏడు మారులు నీ యెడల తప్పిదము చేసి యేడు మారులు నీవైపు తిరిగి మారుమనస్సు పొందితిననినయెడల అతనిని క్షమింపవలెను" అని యేసు చెప్పెను(లూకా 17:4).

d) ఒకని కొరకు ఒకడు ప్రార్థించవలెను :

1. "సహోదరులారా, మాకొరకు ప్రార్థన చేయుడి" యని పౌలు చెప్పెను (1 థెస్స 5:25).

2. "మీ పాపములను ఒకనితో నొకడు ఒప్పుకొనుడి; మీరు స్వస్థత పొందునట్లు ఒకని కొరకు ఒకడు ప్రార్థన చేయుడి. నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహు బలముగలదై యుండును" (యాకోబు 5:16).

e) "మీ నిమిత్తము ప్రార్థన చేయుట మానుటవలన యెహోవాకు విరోధముగా పాపము చేసినవాడ నగుదును" అని సమూయేలు

చెప్పెను (1 సమూ 12:23). మనము ఒకరి కొరకము సహాయము చేసికొందుముగాక!

F. క్రైస్తవులు యిహలోక తత్వమును ఎందుకు విసర్జించవలెను?

1. క్రైస్తవులు ప్రతివిధమైన కీడునుండి దూరముగా యుండవలెను (1 థెస్స 5:22).
2. ఈ లోకమాలిన్యము తమ కంటకుండా తమ్మును తాము కాపాడుకొనవలెను (యాకోబు 1:27).
3. ఈ లోకమును ప్రేమించిన వారిలో తండ్రి ప్రేమ యుండదు (1 యోహాను 2:15).
4. క్రైస్తవులు భక్తిహీనతను, ఇహలోక సంబంధమైన దురాశలను విసర్జించవలెను (తీతు 2:11).
5. ఈ లోకమును ప్రేమించు క్రైస్తవులు ప్రార్థన కూటములకు హాజరుకారు, సంఘ కార్య కలాపములలో పాల్గొనరు.

మీ గ్రామములో యున్న క్రీస్తు సంఘారాధనలన్నిటికి హాజరు కమ్ము!!

—W. A. బ్రాడ్‌ఫీల్డ్.

---

## పాపము

## (*Sin*)

ఈ లోకములో పాపమను మాటను ఉపయోగించని వారుంటూ లేరు. ఎవరైన శ్రమలో యుంటే అయ్యో పాపం అని అంటాము. ఎవరికైనా అన్యాయం జరిగితే పాపం అని అంటాము. అయితే ఈ మాటయొక్క అర్థమేమిటో మీరెప్పుడైనా ఆలోచించారా? ఈ పాపముయొక్క ప్రారంభమును గూర్చి దాని పర్యవసానమును గూర్చి అందరును తెలిసికొనుట మంచిది. ఆజ్ఞాతిక్రమమే పాపము అని

బైబిలు చెప్పుచున్నది (1 యోహాను 3:4). పాపమునకు ఆధారము సాతాను ఏలయనగా అతడు మొదటినుండి పాపము చేయుచున్నాడు వాడు అబద్ధికుడును, అబద్ధమునకు జనకుడై యున్నాడు (1 యోహాను 3:8, యోహాను 8:44). అసలు ఈ పాపము లోకములోని కెట్లు వచ్చెనో చూతము.

## పాపముయొక్క ఆరంభము

దేవుడు ఈ లోకమునంతటిని తన మాటద్వారా 6 దినములలో సృష్టించెను. ఆరవ దినమున నేలమంటితో తన స్వరూపమందు నరుని నిర్మించి వాని నాసికారంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది కా. 2:7). దేవుడైన యెహోవా ఏదేనులో ఒక తోట వేసి తాను నిర్మించిన నరుని దానిలో ఉంచెను. అయితే అతనికొక ఆజ్ఞ యిచ్చెను. ఈ తోటలోనున్న ప్రతి వృక్ష ఫలములను నీవు నిరభ్యంతరముగా తినవచ్చును. అయితే మంచిచెడ్డల తెలివి నిచ్చు వృక్ష ఫలములను తినకూడదు. నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవని చెప్పెను. మరియు దేవుడు నరుడు ఒంటరిగా నుండుట మంచిదికాదని తలంచి అతనికి గాఢనిద్ర గలుగజేసి అతని ప్రక్కటెముకలలో నొకదానిని తీసి స్త్రీనిగా నిర్మించెను. ఆమెకు నారి యని ఆదాము పేరు పెట్టెను (ఆది.కా. 2 అధ్యా). దేవుడులేని సమయమున అపవాది సర్పముద్వారా స్త్రీతో మాట్లాడెను. దేవుడు మీకేమైనా ఆజ్ఞ యిచ్చెనా అని అడుగగా చావకుండునట్లు మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలము తినకూడదని ఆజ్ఞాపించెను అని చెప్పెను. అప్పుడాసర్పము మీరు చావనే చావరు మీరు తిను దినమున మీకన్నులు తెరవబడుననియు, మీరు మంచిచెడ్డలను ఎరిగినవారై దేవతలవలె ఉందురనియు స్త్రీతో చెప్పగా ఆమె ఆ వృక్ష ఫలము ఆహారమునకు మంచిదియు, కన్నులకు అందమైనదియు, వివేకమిచ్చు రమ్యమైనది

యున్నై యుండుట చూచినప్పుడు ఆమె దాని ఫలములలో కొన్ని తీసి కొని తిని తనతోపాటు తన భర్తకును ఇచ్చెను. అతడును తినెను (ఆది.కా. 3:1-6). ఈ విధముగా ఒక మనుష్యునిద్వారా పాపమును, పాపముద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో ఆలాగుననే మనుష్యులందరు పాపము చేసినందున మరణము అందరికిని సంప్రాప్తమాయెను (రోమా 5:12). కాని ఆదాము చేసిన పాపము మనకు సంక్రమించుటలేదు. ఎట్లనగా దేవుడు నరులను యథార్థవంతులుగా పుట్టించెను. గాని వారు వివిధమైన తంత్రములు కల్పించుకొని యున్నారు (ప్రసంగి 7:29). మానవులందరు నశించిపోవుట దేవునికిష్టములేక తన అద్వితీయ కుమారుని లోకములోనికి పంపించి. వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము. పొందునట్లు చేసెను (యోహా 3:16).

## పాపమునకు విరుగుడు

యేసుక్రీస్తు అందరికొరకు విమోచన క్రయధనముగా తన్ను తానే సమర్పించుకొనెను (1 తిమో 2:6). పాపములను తీసివేయుటకై ఆయన ప్రత్యక్షమాయెను. ఆయనయందు పాపమేమియు లేదు (1 యోహాను 3:5). సిలువ మరణముద్వారా దానిని నెరవేర్చెను. యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును (1 యోహాను 1:7). మనందరి పాపములకొరకు ప్రభువైన క్రీస్తు ఒక్కసారే బలియాయెను. కావున మన మికమీదట బలులు, అర్పణాలు, ధూపములు వేయవలసిన పనిలేదు. మన పాపములను తీసివేసికొనుటకు ప్రభువు ఒక సూక్ష్మమైన మార్గమును ఏర్పాటు చేసెను. అది బాప్తిస్మము. ఈ మాట బాప్టిజో అను గ్రీకు మాటనుండి వచ్చినది. ఆ మాటకు ముంచుట అని అర్థము. భక్తుడైన పేతురిట్లు సెలవిచ్చెను: మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున

బాప్తిస్మము పొందుడి అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు (అ.కా. 2:38). యేసు బోధకుడైన నీకొదేము అడిగిన ప్రశ్నకు యిట్లు జవాబిచ్చెను. ఒకడు నీటిమూలముగాను, ఆత్మ మూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింప లేడని చెప్పెను. (యోహా 3:5). ఫిలిప్పి పట్టణములోనున్న చెరసాల నాయకుడు రక్షణపొందుటకు నేనేమి చేయవలెనని అడిగిన ప్రశ్నకు అపొ.పౌలు యిట్లు జవాబిచ్చెను: ప్రభువైన యేసునందు విశ్వాస ముంచి, మారుమనస్సు పొంది, యేసుప్రభువని నోటితో ఒప్పుకొని బాప్తిస్మము పొందవలయునని చెప్పగా ఆరాత్రిలోనే అతడును, అతని యింటివారందరును బాప్తిస్మము పొంది ప్రభువు సంఘములో సభ్యులైనట్లు చూడగలము (అ.కా. 16:30-33).

## రక్షణ వ్యక్తిగతమైనది

ప్రియచదువరీ, ఒకవేళ నీవును అట్టిస్థితిలోయుంటే నేనిచ్చు జవాబు అదే. రక్షణ వ్యక్తిగతమైనది. పాపము చేయువాడే మరణము నొందును. నీతిపరుని నీతి ఆ నీతిపరునికే చెందును. దుష్టుని దుష్టత్వము ఆ దుష్టునికే చెందును అని యెహెజ్కేలు 18:20 లో చెప్పబడెను. కావున ఎవరి ఆత్మరక్షణకొరకు వారే ప్రయాసపడవలయును. మనమొకసారి లోతు కుటుంబమును జ్ఞాపకము చేసికొందము. సొదొమ, గొమొఱ్ఱాల వారు చేసిన ఘోరకృత్యములను బట్టి దేవుడు వాటిన్ని నాశనముచేయుటకు పూనుకొనినపుడు లోతున కీవిషయము తెలియజేసి కుటుంబ సమేతముగా దగ్గరలోయున్న పర్వతమునకు పారిపొమ్మని ఆయన ఆజ్ఞ యిచ్చెను. కాని అతని అల్లుళ్లు ఎగతాళి చేసి నిరాకరించిరి. కావున దేవుడు వాటిని అగ్ని గంధకములతో కాల్చివేసినపుడు వారును నాశనమైరి. వెనుకకు తిరిగి చూడవద్దని వారితో చెప్పగా లోతు భార్య వెనుకకు తిరిగిచూచి ఉప్పు స్తంభ

ముగా మారిపోయెను. ఈ విధముగా ఒకే కుటుంబములో ఘుగ్గురు దేవుని ఆజ్ఞను మీరుటవలన నాశనమైరి (ఆది కా. 19). ఇశ్రాయేలీయులు యెరికోను ముట్టడించినపుడు ఆకాను ఆశించరానిదానిని ఆశించి తాను, తన కుటుంబము నాశనమైనట్లు చూడగలము. ఇశ్రాయేలీయుల మొదటి రాజైన సౌలుతో దేవుడు అమాలేకీయులను సర్వనాశనము చేయుమని ఆజ్ఞ యిచ్చెను. కాని అతడు కొన్నింటిని మిగిల్చెను. ప్రవక్తయైన సమూయేలు దేవుడు చెప్పినదంతయు నెరవేర్చితివా యని అడుగగా ఆలాగే చేసితినని చెప్పెను. ప్రక్కన అరుపులశబ్ద మేమని అడుగగా దేవుడైన నీ యెహోవాకు బలుల నర్పించుటకు జనులు మంచివాటిని ఉంచనిచ్చిరని చెప్పెను. అందుకు సమూయేలు తాను సెలవిచ్చిన ఆజ్ఞను గైకొనుట వలన యెహోవా సంతోషించునట్లు, ఒకడు దహనబలులను, బలులను అర్పించుట వలన ఆయన సంతోషించునా? ఆలోచించుము. బలులు అర్పించుట కంటె ఆజ్ఞను గైకొనుటయు, పొట్టేళ్ళ క్రొవ్వు అర్పించుటకంటె మాట వినుటయు శ్రేష్ఠము. తిరుగుబాటు చేయుట సోదె చెప్పుట యను పాపముతో సమానము. మూర్ఖతను అగపరుచుట మాయా విగ్రహము గృహ దేవతలను పూజించుటతో సమానము. యెహోవా ఆజ్ఞను నీవు విసర్జించితివి గనుక నీవు రాజుగా ఉండకుండ ఆయన నిన్ను విసర్జించెనని చెప్పెను (1 సమూ 15 అధ్యా).

అదే ప్రకారముగా ఈ కాలములో కూడ అనేకమంది దేవుడు ఆజ్ఞాపించిన వాటిని చేయక, చెప్పని వాటిని చేయుచూ సౌలువలె దేవునికొరకే చేయుచున్నామని చెప్పుచున్నారు. అటువంటివారిని గూర్చి దేవుడు సంతోషించునా? ఉదాహరణకు సంఘమునకు శిరస్సు క్రీస్తు అని బైబిలు చెబితే అనేకమైన పేర్లను ధరించుకొనుచున్నారు. ప్రభు రాత్రి భోజనమును ప్రతి ఆదివారం ఆచరించవలయునని ఆజ్ఞ యిస్తే నెల

కొకసారి, సంవత్సరమున కొకసారి ఆచరించుచున్నారు (అ.కా. 20:7). జిహ్వాఫలము లర్పించమని దేవుడు కోరగా వాయిద్యములను కల్పించు కొని ఆరాధించుచున్నారు (హెబ్రీ 13:15). ఇంకను అనేక విషయ ములలో తప్పిపోవుచున్నారు. అటువంటి వారందరు సౌలును జ్ఞాపకము చేసుకొనవలెను. ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి యుగాంతమందున్న మనకు బుద్ధికలుగుటకై వ్రాయబడెను (1 కొరింథీ 10 : 11).

## పాపము — పర్యవసానము

ఇంకను ఏమేమి పాపమో పరిశీలింతము. శరీర కార్యములు స్పష్టమై యున్నవి. అవేవనగా జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, ద్వేషములు, క్రోధములు, కక్షలు, అల్లరితో కూడిన ఆటపాటలు మొ॥నవి పాపమని చెప్పబడెను. మద్యముతో మత్తులై యుండుట పాపము (ఎఫెసీ 5:18). త్రాగుబోతులైనను, దూషకు లైనను, దొంగలైనను, పిరికివారు, అవిశ్వాసులు, నరహంతకులు, దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు (1 కొరింథీ 6:9; ప్రకటన 21:8). సకల దుర్నీతియు పాపము (1 యోహాను 5:17). మేలైనది చేయనెరిగియు ఆలాగు చేయనివానికి పాపము కలుగును. అనగా సత్య మని తెలిసి యుండి దానిని ఆచరించకపోవుట (యాకోబు 4:17). ఈ పాపమువలన వచ్చు జీతము మరణము (రోమా 6:23). పాపులు నిత్యాగ్ని లోనికి పడవేయబడుదురు. అక్కడ ఏడ్పును, పండ్లు కొరుకుటయు ఉండును (మత్తయి 25:41).

## స్వ ప రీ క్ష అ వ స ర ము

కావున ప్రియచదువరీ, ఎవడును నిన్ను మోసపరచనీయకుండ చూచుకో. ఏలయనగా అనేక అబద్ధ ప్రవక్తలు, బోధకు లుందురు.

నీరు తమ్మును కొనిన ప్రభువునుకూడ విసర్జించుచు తమకు తామే శీఘ్రముగా నాశనము కలుగజేసి కొనుచు నాశనకర మగు భిన్నాభిప్రాయములను రహస్యముగా బోధించుదురు (II పేతురు 2:1). గనుక ప్రతి ఆత్మను నమ్మక ఆయా ఆత్మలు దేవుని సంబంధ మైనవో కావో పరీక్షించుడి (I యోహాను 4:1). క్రీస్తు బోధయందు నిలిచియుండక దానిని విడిచి ముందునకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడని గుర్తించుకొన వలయును (II యోహాను :9). కావున దేవుని ఆజ్ఞలకు ఏమియు కలుపకూడదు. తీసివేయకూడదు (ద్వితీ 4:2). ఏలయనగా దేవుని మాటలన్నియు పుటము పెట్టబడినవే. (సామె 30:5). కావున మీ ఆరాధన, విశ్వాసము వాక్యానుసారి ముగ యున్నదో లేదో పరీక్షించుకొనుడి. ఒకవేళ లేనిచో అట్లు చేయుటకు తీర్మానము చేసుకొనుడి. ఆ అజ్ఞాన కాలమును దేవుడు చూచి చూడనట్టుగా యుండెను. ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు (అపొ.కా. 17:30). ఏలయనగా అతిక్రమములను దాచిపెట్టు వాడు వర్ధిల్లడు. వాటిని ఒప్పుకొని విడిచిపెట్టువాడు కనికరముపొందును. (సామె 28:13). మీరు మారుమనస్సు పొందనియెడల మీరందరు ఆలాగే నశింతురు అని ప్రభువు చెప్పెను (లూకా 13:3). ఇందు నిమిత్తము మీరు అవివేకులు కాక ప్రభువుయొక్క చిత్తమేమిటో గ్రహించుకొనుడి.

—వి. ఫిలేమోన్.

---

"పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మతగినదియు, పూర్ణాంగీకారమునకు యోగ్యమైనది యునై యున్నది" (I తిమో 1:15).

## పాప మెట్లు పోవును

మానవుడు దేవుని ఆజ్ఞ అతిక్రమించుటచే పాపముచేసినవాడై దేవునికి దూరస్థుడై యున్నాడు. దూరముగా యున్న మానవుడు తిరిగి దేవుని యొద్దకు మరలా ఎట్లు తిరిగిరాగలడు? అతని పాప మెట్లు పోవును ? అందరు పాపులే యని అన్ని మతములవారు ఒప్పుకొను చున్నారు. ఏ భేదము లేదని అందరు పాపులేయని దేవుని వాక్యము చెప్పుచున్నది (రోమా 3:23; 3:11). పాపమువలన వచ్చు జీతము అగ్నిగుండమని రోమా 6:23; ప్రకటన 21:8 చెప్పుచున్నది. పాపములు తీసివేసుకొనుటకు ప్రజలు మిగుల ప్రయాస పడుచున్నారు. తీర్థయాత్రలు, పుణ్య క్షేత్రములు దర్శించుట, నదులలో స్నానము చేయుట మొదలగు ప్రయత్నములు చేసి పాపము తీసివేసుకొనుటకు మిగుల ప్రయాసపడుచున్నారు.

## స్వప్రయత్నము వలన పాపము పోదు

తమ మార్గము నేర్పరచుకొనుటకు నరుల వశములో లేదని, మనుష్యులు తమ ప్రవర్తనయందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదని నేనెరుగుదునని యెహోవా సెల విచ్చుచున్నాడు అని యిర్మియా 10:23 లో వ్రాయబడి యున్నది. కూషు దేశస్థుడు తన చర్మమును మార్చుకొనగలడా ? చిరుతపులి తన మచ్చలను మార్చుకొనగలదా ? మార్చుకొనగలిగిన యెడల కీడు చేయుటకు అలవాటుపడిన మీరును మేలుచేయ వల్లపడును అని యిర్మియా 13:23 లో వ్రాయబడి యున్నది. తమ యిష్ట వస్తువులలో ఒకదాని చేతనైనను తమ్మును తాము రక్షించుకొన జాలరని యోబు 20:20 లో వ్రాయబడి యున్నది. మానవ నీతిక్రియలన్నియు మురికి గుడ్డలవలె యున్నవనియు; మన నీతిక్రియలచేత రక్షించుకొన లేమనియు తీతు 3:5 లో వ్రాయబడినది.

## యజ్ఞయాగములు పాపమును తీసివేయలేవు

క్రీస్తు పూర్వము యూదులు ధర్మశాస్త్రము ప్రకారము జంతు బలులు అర్పించెడివారు. వారి యాజకుడు ఇశ్రాయేలీయుల సమూహముననుండి పాపపరిహారార్థబలిగా రెండు మేకపిల్లలను తీసికొని దానిలో ఒకదానిని వారి పాపముల నిమిత్తము వధించేవాడు. రెండవ మేక తలమీద ఇశ్రాయేలీయుల పాపములన్నియు వారి అతిక్రమము లన్నియు ఒప్పుకొని దానిమీద మోపి ఆ తరువాత తగిన మనుష్యుని చేత అరణ్యములోనికి తోలించేవారు. ఆ మేక వారి దోషము లన్నిటిని భరించి ఎడారి ప్రదేశమునకు పోవును. యాజకుడును, అహరోను తన కొరకు, ప్రజల కొరకు దహన బలులు అర్పించి తన నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయవలెను (లేవి 16:7 నుండి 24 వచనములు). బలులు అర్పించుటచేత పాపములు ప్రతి సంవత్సరము జ్ఞాపకమునకు వచ్చుచున్నవి. జంతువుల రక్తము పాపములు తీసివేయుట అసాధ్యము అని హెబ్రీ 10:34 లో వ్రాయబడియున్నది.

## మరియొకరి పాపము సాటిమానవుడు తీసివేయలేడు

రాజులచేతనైనను, నరులచేతనైనను రక్షణ కలుగదు, వారిని నమ్మకుడి అని కీర్తనల గ్రంథము 146:3 లో వ్రాయబడి యున్నది. వారి జోలికి పోకుడి, వారు గ్రుడ్డివారై యుండి గ్రుడ్డివారికి త్రోవ చూపువారై యున్నారు. గ్రుడ్డివాడు గ్రుడ్డివానికి త్రోవ చూపించిన యెడల యిద్దరు గుంటలో పడుదురు అని మత్తయి 15:14 లో వ్రాయబడినది. పాపము లేనివాడే పాపములు తీసివేయ సమర్థుడు. పాపసహితునిలోనుండి పాపరహితుడు పుట్టగలిగిన ఎంత మేలు? అని యోబు 14:4 లో వ్రాయబడి యున్నది.

## పాపముపోవు మార్గము

పాపముపోవు మార్గము ఒకటే. మార్గములలో నిలచి చూడుడి.

నిజమైన మార్గము గమనించుడి అని యిర్మియా 6:16 లో వ్రాయబడి యున్నది. అందుకు యేసు, నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానేతప్ప యెవడు తండ్రియొద్దకు రాడని యోహాను 14:6 లో బోధించెను. పాపములు తీసివేయుటకును, పాపిని రక్షించుటకును క్రీస్తు యీ లోకమునకు వచ్చెను అని I తిమోతి 1:15; మత్తయి 1:21; లూకా 19:10; యోహాను 8:46; యోహాను 1:29 లలో వ్రాయబడి యున్నది. నీ పాపము పోవుటకు ఒకటే మార్గము: పాపములకొరకు చనిపోయి, పునరుత్థానుడైన క్రీస్తును గూర్చి వినుము. ఆయనయందు విశ్వాసముంచుము. పాపముల విషయమై మారు మనస్సు నొందుము. ఆయనను దేవుని కుమారుడు అని ఒప్పుకొనుము. నీపాపము పోవునట్లుగా పాపక్షమాపణకొరకు బాప్తిస్మము పొందుము. అప్పుడు నీ పాపము పోవును. ప్రభువు తన సంఘమందు నిన్ను చేర్చుకొనును (అపొస్తలుల కా. 2:47, II కొరింథి 6:2; హెబ్రీ 2:3).

— యు. ఇశ్రాయేలు.

---

## పరలోకమందలి తండ్రి చిత్తము

### ( *The Will of the Father in Heaven* )

"ప్రభువా, ప్రభువా అని నన్ను పిలచు ప్రతీవాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నా తండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును" మత్తయి 7:21.

నేటి దినములలో అనేక సంఘనాయకులు దర్శనము ద్వారానో, స్వరముద్వారానో లేక ప్రేరేపణవలననో దేవుని చిత్తము నాకు బయలు పడుచున్నదని చెప్పుకొనుచూ విభిన్న సిద్ధాంతాలు గల ఎన్నో సంఘములను భిన్న పేరులతో స్థాపించుచూ విస్తరించు చుండుట

మనము చూచుచున్నాము. క్రీస్తు ఇట్లు చెప్పెను: "నేను చెప్పిన మాటల ప్రకారము చేయక ప్రభువా ప్రభువా అని నన్ను పిలచుట ఎందుకు?" లూకా 6:46. గనుక దేవుని చిత్తమును పరీక్షించి తెలిసి కొందము.

1. పరలోకమందును భూమిమీదను సర్వాధికారమును కుమారునికి అప్పగించుటయే తండ్రి చిత్తము. మత్తయి 28:18, ఎఫెసీ 1:21, ఫిలిప్పీ 2:9-11, 1 పేతురు 3:22. "ఈయన నా ప్రియకుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నాను, ఈయన మాట వినుడి" (మత్తయి 17:5).

2. పరలోకమందున్న తండ్రి చిత్తమును, కుమారుడైన క్రీస్తు తెచ్చి లోకమునకు బోధించెను (హెబ్రీ 1:1).

A. క్రీస్తు :-"...నాఅంతట నేనే మాటలాడుటలేదు, నేనేమనవలెనో ఏమి మాటలాడవలెనో దానిని గూర్చి నన్ను పంపిన తండ్రియే నాకాజ్ఞ యిచ్చి యున్నాడు"
"తండ్రి నాకు నేర్పినట్టు ఈ సంగతులు మాటలాడుచున్నాను..." (యోహాను 12:49; 8:28).

B. "నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు జీవమునై యున్నవి".

C. "నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును" (యోహాను 6:63; 12:48).

3. క్రీస్తు తానేర్పరచుకొనిన అపొస్తలులకు సంపూర్ణమైయున్న దేవుని చిత్తమును పూర్ణముగా బోధించలేదు:
"నేను మీతో చెప్పవలసినవి ఇంకను అనేక సంగతులు కలవు గాని ఇప్పుడు మీరు వాటిని సహింపలేరు" యోహాను 16:12.

4. తండ్రి చిత్తమును సంపూర్ణముగా బోధించి అపొస్తలులను సర్వ సత్యములోనికి నడిపించు బాధ్యతను పరిశుద్ధాత్మునికి క్రీస్తు అప్పగించెను :

A. పరిశుద్ధాత్మ క్రీస్తువలన వినిన సంగతులను అపొస్తలులకు జ్ఞాపకము చేయును.

B. సమస్తమును అపొస్తలులకు బోధించును.

C. "సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును".

D. పరిశుద్ధాత్మ "ఆయన తనంతట తానేమియు బోధింపక క్రీస్తువలన వినిన సంగతులను బోధించును, క్రీస్తులోనివి తీసుకొని బోధించును. సంభవింపబోవు సంగతులను తెలియజేయును" (యోహా 14:26, 16:13-15).

5. అపొస్తలులు సర్వసత్యములోనికి నడిపింపబడినవారై సంఘమునకు నేర్పించి, నడిపించుచుండిరి:

A. క్రీస్తు అపొస్తలులతో"...కొద్ది దినములలోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందెదరు. నావలన వినిన తండ్రియొక్క వాగ్దానముకొరకు కనిపెట్టుడి యని చెప్పెను.

B. అపొస్తలులు : "అందరు ఒకచోట కూడియుండిరి......అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ..."

"వారందరు పరిశుద్ధాత్మతో నిండినవారై దేవుని వాక్యమును ధైర్యముగా బోధించిరి."

"నేను మాటలాడినను సువార్త ప్రకటించినను......పరిశుద్ధాత్మయు దేవుని శక్తియు కనపరచు దృష్టాంతములనే వినియోగించితిని"

"...ఆత్మ నేర్పు మాటలతో వీటిని గూర్చియే మేము బోధించుచున్నాము." అ.కా. 1:4, 5, 2:1-4, 4:31, 1 కొరింథీ 2:4-5, 13.

"నేమెుక్క ఆత్మవలననే ఒక్క అడుగు జాడలయందే నడచుకొనలేదా?"

"ఈ అవశ్యమైన వాటికంటె ఎక్కువైన యేభారమును మీ మీద మోపకూడదని పరిశుద్ధాత్మకును మాకును తోచెను" (II కొరింథి 12:18, అపో.కా. 15:29).

C. "అపొస్తలుల బోధను గైకొనుటవలన సంఘములు విశ్వాసమునందు స్థిరపడి, అనుదినము లెక్కకు విస్తరించుచుండెను" (అపో.కా. 16:4-5).

"వీరు అపొస్తలుల బోధయందు...ఎడతెగక యుండిరి." (అపో.కా. 2:42).

"నీవు నావలన వినిన హితవాక్య ప్రమాణములను గైకొనుము" (2 తిమో 1:13).

"...మీరు దేవుని గూర్చిన వర్తమాన వాక్యము మావలన అంగీకరించినపుడు..." (1 థెస్స 2:13).

"ఆయన మా సువార్తవలన మిమ్మును పిలిచెను...మానోటి మాట వలన మీకు బోధింపబడిన విధులను చేపట్టుడి". "మేము మీకు ఆజ్ఞాపించినవాటిని మీరు చేయుచున్నారయు..." (2 థెస్స 2:14-15, 3 : 4).

"ప్రతి మనుష్యుని క్రీస్తునందు సంపూర్ణునిగా చేసి ఆయన యెదుట నిలువబెట్టవలెనని, సమస్త విధములైన జ్ఞానముతో మేము ప్రతి మనుష్యునికి బుద్ధిచెప్పుచు, ప్రతి మనుష్యునికి బోధించుచూ ఆయనను ప్రకటించుచున్నాము" (కొలస్స 1:28).

"ప్రభువైన రక్షకుడు మీ అపొస్తలులద్వారా ఇచ్చిన ఆజ్ఞను" (2 పేతురు 3:2).

"యేసుక్రీస్తు అపొస్తలులు పూర్వమందు మీతో చెప్పిన మాటలను జ్ఞాపకము చేసికొనుడి"

"మావలన పొందిన బోధన ప్రకారము కాక అక్రమముగా నడుచుకొను ప్రతి సహోదరుని యొద్ద నుండి తొలగిపోవలెనని మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మీకు ఆజ్ఞాపించుచున్నాను" (2 థెస్స 3:4,6).

"పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధ..." (యూదా :3), స్థిరపడినందున (హెబ్రీ 2:2), అపొస్తలులు వ్రాసిన లేఖనములు భద్రపరుపబడెను. అవియే నేటి మనచేతిలో గల 27 పుస్తకముల క్రొత్త నిబంధన గ్రంథము. "సంపూర్ణమై యున్న దేవుని చిత్తమును" (రోమా 12:2) పరీక్షించి తెలిసికొన వలసిన గ్రంథ మిదియే, ఇది మాత్రమే దేవుని సంపూర్ణ నియమము (యాకోబు (1:25).

అపొస్తలుడు :-"నేను మృతిపొందిన తరువాత కూడా నిత్యము వీటిని జ్ఞాపకము చేసికొనునట్లు జాగ్రత్త చేతును" (2 పేతురు 1:12-15).

"ప్రియులారా, ఈ రెండవ పత్రిక వ్రాయుచున్నాను...అపొస్తలులద్వారా ఇచ్చిన ఆజ్ఞను మీరు జ్ఞాపకము చేసికొనవలెనను విషయమును మీకు జ్ఞాపకముచేసి..." "పౌలు కూడా తనకు అనుగ్రహింపబడిన జ్ఞానముచొప్పున మీకు వ్రాసియున్నాడు" (2 పేతురు 3:1-2, 15).

"మీకు జ్ఞాపకము చేయవలెనని యుండి మరి యెక్కువ ధైర్యము కలిగి మీకు వ్రాయుచున్నాను" (రోమా 15:15-16).

"మా పత్రికవలన మీకు బోధింపబడిన విధులను చేపట్టుడి" (2 థెస్స 2:15).

"మీరు మమ్మునుచూచి లేఖనములయందు వ్రాసియున్న సంగతులను అతిక్రమించకూడదని నేర్చుకొని..." (1 కొరింథి 4:6).

"చదువుటయందును...జాగ్రత్తగా ఉండుము"

"చదువుకొని పూర్తిగా గ్రహించిన సంగతులుతప్ప మరేవియూ మీకు వ్రాయుటలేదు" (1 తిమో 4:18; I I కొరింథి 1:13).

7. లేఖనములను పరిశోధించుడి (యోహాను 5 : 39; అపొ. కా. 17 : 11)కా

A. రక్షణార్థమైన జ్ఞానము కలిగించు శక్తి లేఖనములయందున్నది.

B. ఉపదేశించుటకు, ఖండించుటకు, తప్పు దిద్దుటకు, నీతియందు శిక్షణ నిచ్చుటకు లేఖనములే ప్రయోజనకరమై యున్నవి.

C. దైవజనుడు సంపూర్ణముగా సిద్ధపడుటకు లేఖనములు మాత్రమే తోడ్పడుచున్నవి (2 తిమోతి 3:14-17).

D. అపొస్తలులకు దేవదర్శనమువలన తెలుపబడిన మర్మములు లేఖనములు చదువుటవలన మనకు తెలియనగును. (ఎఫెసీ 3:3-4, 1 యోహాను 1:1-4).

E. దర్శనములవలన తెలుపబడినదానికంటె స్థిరమైన ప్రవచన వాక్యము లేఖనములయందు మనకున్నది.

F. చీకటిగలచోట్ల వెలుగిచ్చు దీపమైనట్లున్న దేవుని వాక్యము మనకు లేఖనములందు దొరుకుచున్నది (2 పేతు 1:17-21).

G. అపొస్తలులు అవును అని చెప్పి మరలా కాదు, కాదు అని చెప్ప నట్టి క్రీస్తు వాక్యము లేఖనములందు మాత్రమే మనము కను గొనగలము (2 కొరింథీ 1:17-22).

H. పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధ లేఖనములయందే మనము కనుగొనగలము. (యూదా 3).

I. విశ్వాసులకు ఆదరణ, సంతోషము లేఖనములు చదువుటవల ననే కలుగుచున్నది (అపొ. కా. 15:30-31).

J. ఓర్పు నిరీక్షణ కలిగించు బోధ లేఖనములనుండి నేర్చుకొను చుండుట దేవుని చిత్తము (రోమా 15:4, 15-16).

K. అపొస్తలులు ప్రకటించిన సువార్తకాక భిన్నమైన సువార్త ఎట్టిదో తెలిసికొనే అవకాశము, దొంగ అపొస్తలులను తెలిసి కొను విధము, దురోచ్ఛలను ఎదుర్కొను శక్తి క్రీస్తు సువార్త

సత్యము యొక్క క్రమము లేఖనముల నుండి మాత్రమే తెలియనగును (రోమా 16:17-18; 2 కొరింథీ 11:13; గలతీ 1:6-9, 2 యోహాను 9).

L. వర్తమాన, భూత, భవిష్యత్ కాలములయందలి దేవుని చిత్తమును గూర్చి పొరబడకుండునట్లు తెలిసికొనవలసిన జ్ఞానము లేఖనములయందే కనుగొనగలము గాని వేరు మార్గము లేదు (మార్కు 12:24).

M. క్రీస్తులో జీవించుచున్నామనుటకు ఋజువు లేఖనములనుండియే పొందగలము.

N. పరలోకమందున్న తండ్రి అనాదికాలమునుండి ప్రవక్తల ద్వారా తెలియజేయుచు వచ్చిన తన కుమారుని సంఘము ఎప్పుడు, ఎక్కడ, ఎవరివలన స్థాపించబడెనో లేఖనములులనుండి మాత్రము మనకు తెలియును.

O. దేవుని చిత్తానుసారము స్థాపించబడిన సంఘము ఏ పేరును కలిగియుండవలెనో లేఖనములు పరిశోధించిన గ్రహించగలము.

P. సంఘములో దేవుని ఆరాధించు క్రమము లేఖనములు మాత్రము బోధించుచున్నవి.

Q. సంఘముయొక్క పరిపాలన పద్ధతి లేఖనములలో తేటగా చూచుచున్నాము.

R. సంఘ కార్యవర్గమున కుండవలసిన పేరులు లేఖనములనుండి మాత్రమే పొందగలము.

8. "కాలము సంపూర్ణమైనపుడు జరుగవలసిన ఏర్పాటును బట్టి ఆయన తన దయాసంకల్పము చొప్పున తన చిత్తమును గూర్చిన మర్మమును మనకు తెలియజేసి, మనకు సంపూర్ణమగు జ్ఞాన వివేకములు కలుగుటకు ఆ కృపను మనయెడల విస్తరింపజేసెను" (ఎఫె 1:8,9).

ముగింపు: తండ్రి చిత్తము కుమారుడైన క్రీస్తుకు అప్పగించగా క్రీస్తు, పరిశుద్ధాత్మకు అప్పగించెను. పరిశుద్ధాత్ముడు అపొస్తలులకు అప్పగించగా అపొస్తలులు నోటి మాటలతోను పత్రికల మూలముగాను అనగా క్రొత్త నిబంధన గ్రంథముద్వారా సంఘమునకు అప్పగించిరి. సంఘముద్వారా లేఖనములయందలి జ్ఞానము ప్రకటింపబడుచూ సదా కాలము, సంఘములో దేవునికి మహిమ కలుగుచుండును, ఆమెన్ (ఎఫెసీ 3:8-9, 20-21).

—పాల్ గూటం.

---


*From*

**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA-533 001


**BOOK-POST**
Printed Book only

**To**

..............................

..............................

..............................